సాక్షి

కుమురం భీం

గురువారం : 30 : జనవరి : 2025



కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు

లింగాపూర్ మండలంలో జనావాసాల మధ్య, రోడ్ల పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కంచెలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. 9లో▸



కొంగుబంగారం..బాలేశ్వరుడు

జిల్లాకేంద్రంలోని బాలేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 4న రథోత్సవం నిర్వహించనున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.4 /18.7

వాతావరణం

ఆకాశం చాలా వరకు నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రాత్రిపూట చలి కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

31న పాఠశాలలకు సెలవు

ఆసిఫాబాద్‌రూరల్: నాగోబా జాతర సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈ నెల 31న సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో నాగోబా జాతర ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని అన్ని పాఠశాలలకు శుక్రవారం సెలవు ఉంటుందన్నారు. బదులుగా మార్చి 8న రెండో శనివారం పాఠశాలలు కొనసాగుతుయని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా జూనియర్ కళాశాలలకు సెలవు వర్తించదని స్పష్టం చేశారు.

కుష్ఠు రహిత జిల్లాగా మార్చుదాం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సీతారాం

ఆసిఫాబాద్‌అర్బన్: కుష్ఠు రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కలిసిరావాలని డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహించే స్పర్శ్ లెప్రసీ క్యాంపెయిన్- 2025పై బుధవారం జిల్లాకేంద్రంలో అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిగ్రస్తుల శరీరం పాలిపోయి రాగి రంగు మచ్చలు ఏర్పడతాయని, స్పర్శ లేకపోవడం, తిమ్మిర్లు తదితర లక్షణాలు ఉంటాయని తెలిపారు. బహుళ ఔషధ చికిత్స ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం కుష్ఠు నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. పక్షోత్సవాల్లో భాగంగా గ్రామ పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. సమావేశంలో లెప్రసీ ప్రోగ్రాం అధికారి అజిమొద్దీన్, ప్రోగ్రాం జిల్లా సహాయ అధికారి ఇస్లావత్ శ్యాంలాల్, పీహెచ్‌సీల వైద్యాధికారులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొలావార్‌లు ఐకమత్యంగా ఉండాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య

దహెగాం(సిర్పూర్): కొలవార్‌లు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఐకమత్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్య, ఉద్యోగ, రాజకీయంగా కొలవార్‌లు వెనుకబడిపోయారన్నారు. పిల్లలను బడికి పంపి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మన్నెవార్ల పేరుతో నకిలీ సర్టిఫికెట్లు పొంది ఉద్యోగ, రాజకీయాల్లో కొందరు స్థిరపడిపోతున్నారని ఆరోపించారు. పెసా, అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోగుల రాజన్న, జిల్లా అధ్యక్షుడు డబ్బ బాపు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కమ్మరి భీమయ్య, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేడి సతీష్, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఐదు నెలల వేతనాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో బుధవారం ఏఐటీయూసీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీవీవీపీ పరిధిలోని ఆసిఫాబాద్, వాంకిడి, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), బెజ్జూర్ ఆస్పత్రుల్లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది వేతనాలు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఏజెన్సీలకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తున్న డీసీహెచ్‌ఎస్‌పై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దివాకర్, సభ్యులు శంకర్, సాగర్‌గౌడ్, రాజేశ్, కమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన పూజలు.. మొదలైన మొక్కులు



బుధవారం తెల్లవారుజామున ఆలయం ఎదుట బారులు తీరిన భక్తులు

- వివరాలు 8లో▸

మహాపూజతో నాగోబా జాతర మొదలైంది. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ భక్తజన సందడిగా మారింది. బుధవారం కూడా మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు కొనసాగాయి. అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు భేటింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి ఆదివాసీలు, భక్తులు వచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని నాగోబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. - ఇంద్రవెల్లి



ముఖద్వారం వద్ద పూజలు చేస్తున్న వంశపెద్దలు



భేటింగ్‌కు ముందు తెల్లటి దుస్తుల్లో కొత్త కోడళ్లు

ఉపాధిలో మనమే టాప్

- పనిదినాల కల్పనలో ప్రథమస్థానం
- పది నెలల్లోనే లక్ష్యానికి మించి.. గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పన
- జిల్లాలో జోరుగా ఈజీఎస్ పనులు

2024-25కు సంబంధించి పనిదినాల వివరాలు

మండలం	పనిదినాల లక్ష్యం	పూర్తయిన పనిదినాలు
ఆసిఫాబాద్	3,47,600	3,45,601
బెజ్జూర్	3,15,451	2,94,734
చింతలమానెపల్లి	1,91,931	1,76,932
దహెగాం	3,21,855	3,60,919
జైనూర్	2,27,278	2,18,837
కాగజ్‌నగర్	2,90,975	2,80,358
కెరమెరి	3,49,515	3,33,002
కౌటాల	3,10,000	3,02,156
లింగాపూర్	1,62,220	1,72,564
పెంచికల్‌పేట్	1,52,090	1,51,612
రెబ్బెన	2,60,078	2,77,745
సిర్పూర్(టి)	1,86,320	1,99,801
సిర్పూర్(యూ)	2,69,000	1,27,567
తిర్యాణి	2,51,727	3,59,794
వాంకిడి	2,32,800	3,12,800
మొత్తం	38,71,840	39,13,972



జిల్లాలో ఉపాధిహామీ పథకం వివరాలు	జాబ్‌కార్డులు:	కూలీల సంఖ్య:	యాక్టివ్ జాబ్ కార్డులు:
	1,23,035	2,43,969	91,721
	యాక్టివ్ కూలీలు: 1,70,268		

తిర్యాణి(ఆసిఫాబాద్): దారిద్ర్యరేఖకు దిగువనున్న కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 2005లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం జిల్లాలో సత్ఫలితాలనిస్తోంది. జిల్లాలో 1,23,035 జాబ్‌కార్డులుండగా 2,43,969 మంది కూలీలు పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ పథకంలో ముఖ్యంగా రైతుకు ఉపయోగకరంగా ఉండే పనులు చేపడుతున్నారు. దీంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుండగా.. నిరుపేద కూలీలకు ఉపాధి లభిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం వరకు రూ.272 ఉన్న వేతనాన్ని ప్రభుత్వం రూ.297కు పెంచింది. భూమి లేని 'ఉపాధి' కూలీలకు ఏటా రూ.12 వేలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వగా జిల్లాలో ఈ ఆర్థికసంవత్సరంలో పనులు జోరందుకున్నాయి.

రెండు నెలల ముందే..

ఉపాధిహామీ కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని కూలీలకు 38,71,840 పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. కాగా, ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో రెండు నెలలు ఉండగానే లక్ష్యాన్ని చేరుకుని కూలీలకు ఏకంగా 39,13,972 పని దినాలు కల్పించారు. జిల్లాలో 15 మండలాలు ఉండగా తిర్యాణి, వాంకిడి, దహెగాం, లింగాపూర్, రెబ్బెన, సిర్పూర్(టి) మండలాల్లో లక్ష్యానికి మించి పని దినాలు పూర్తి చేశారు. ఒక్క సిర్పూర్(యూ) మండలం మినహా మిగతా ఎనిమిది మండలాల్లో లక్ష్యానికి చేరువయ్యారు. అత్యధికంగా తిర్యాణి మండలంలో 2,51,727 పని దినాల లక్ష్యం విధించగా ఏకంగా 3,59,794 పని దినాలను పూర్తి చేశారు. అత్యల్పంగా సిర్పూర్(యూ)లో 2,69,000 పనిదినాలకు గాను 1,27,567 పనిదినాలు పూర్తి చేశారు. దీంతో ఉపాధిహామీలో లక్ష్యాన్ని మించి పనిదినాలు కల్పించి రాష్ట్రంలో జిల్లా టాప్‌లో నిలిచినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వానాకాలం సాగు పనులు పూర్తిగా ముగిశాయి. ఈ ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుండగా మరిన్ని పని దినాలు పూర్తయ్యే అవకాశముంది.

ఉపాధి కల్పనకు చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు పరిశ్రమలు, వాణిజ్యరంగాల్లో ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఆఫ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కమిటీ సమావేశం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి.. ఉద్యోగ సమాచారం అందించాలని ఆదేశించారు. అవకాశాలపై అవగాహన కల్పించాలన్నారు. కంపెనీలతో చర్చించి జిల్లాలో జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. అనంతరం పీఎం విశ్వకర్మ పథకం కింద అందిన దరఖాస్తులపై సమీక్షించారు. ఇప్పటివరకు 2,654 మంది దరఖాస్తు చేసుకున్నారని, శిక్షణ పూర్తి చేసిన వారిలో 452 మందికి రుణాలు మంజూరు చేశామని తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, డీఆర్‌డీవో దత్తారావు, డీపీవో భిక్షపతిగౌడ్, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో టీప్రైడ్, డీట్, పీఎం విశ్వకర్మ పథకం, తదితర అంశాలపై సమీక్షించారు. టీ ప్రైడ్ పథకం ద్వారా దళితులు, గిరిజనులకు సంబంధించి రెండు పెట్టుబడి రాయితీ దరఖాస్తులను ఆమోదిస్తూ రూ.6.37 లక్షలు, పావలా వడ్డీ రాయితీ దరఖాస్తు ఆమోదిస్తూ రూ.13 వేలు మంజూరు చేశామని తెలిపారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్సెంజ్ ఆఫ్ తెలంగాణ(డీట్) జిల్లా కమిటీ విధివిధానాలపై మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో కూడిన డీట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంలో 110 దరఖాస్తులను స్టేజ్- 2 నుంచి స్టేజ్- 3కి పంపించేందుకు ఆమోదించామన్నారు. జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ మదిరే అశోక్, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, డీఆర్‌డీవో దత్తారావు పాల్గొన్నారు.

ఆదివాసీల సంస్కృతి గొప్పది



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

తిర్యాణి(ఆసిఫాబాద్): ఆదివాసీల సంస్కృతి గొప్ప దని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండలంలోని గడలపల్లిలో బుధవారం నిర్వహించిన వహండి కూపర్ లింగో పూజ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆదివాసీ నాయకుడు సోయం చిన్నన్న రచించిన కోయ పుణ్యం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులను కుటుంబ సభ్యులుగా భావించి సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు చేయిస్తామన్నారు. గోండ్వాన పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం అర్జు మాస్టార్, జిల్లా సర్‌మెడి మోతీరాం, నాయకులు అనిల్‌గౌడ్, కమల, చుంచు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో 'తిర్యాణి' అభివృద్ధి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, తదితరులు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

తిర్యాణి(ఆసిఫాబాద్): అధికారుల సమష్టి కృషితోనే తిర్యాణి మండల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. నీతి ఆయోగ్ బ్లాక్ కింద మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో అర్హులైన మహిళా సంఘాల సభ్యులకు రుణాలు అందించి, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనులకు రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి మోడల్ రూపొందించాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఏపీడీ రామకృష్ణ, తహసీల్దార్ సూర్యప్రకాశ్, ఎంపీడీవో మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సందర్శించి.. సమస్యలు తెలుసుకుని

మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. రాత్రి ఆశ్రమ పాఠశాలలోనే నిద్రించారు. ఆయన వెంట ఎంపీడీవో వేముల మల్లేశ్, ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ హైదరాబాద్ ద్వారా ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల కోసం కోసం క్రిస్టియన్, మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతోపాటు సంబంధిత పత్రాలను జతపర్చి ఈ నెల 31వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల వేడి

- విడుదలైన షెడ్యూల్
- పట్టభద్రులు, టీచర్ల స్థానాలకు ఎన్నిక
- మద్దతు కోసం ఓట్ల వేటలో అభ్యర్థులు

షెడ్యూల్ ఇలా..
ఫిబ్రవరి 3న నోటిఫికేషన్
ఫిబ్రవరి 3నుంచి 10వరకు నామినేషన్ల స్వీకరణ
ఫిబ్రవరి 27న పోలింగ్
మార్చి 3న ఓట్ల లెక్కింపు



ఉపాధ్యాయ ఓటర్లు

జిల్లా	పురుషులు	స్త్రీలు	మొత్తం
ఆసిఫాబాద్	314	143	457
మంచిర్యాల	940	610	1,550
ఆదిలాబాద్	1,073	488	1,561
నిర్మల్	1,263	681	1,944

పట్టభద్ర ఓటర్లు

జిల్లా	పురుషులు	స్త్రీలు	మొత్తం
ఆసిఫాబాద్	4,106	1,749	5,855
మంచిర్యాల	18,882	11,606	30,488
ఆదిలాబాద్	10,104	4,482	14,586
నిర్మల్	11,271	5,538	16,809

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎమ్మెల్సీ ఎన్నికల వేడి మొదలైంది. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నియోజకవర్గ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నిక కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఎన్నికల నగారా మోగింది. ఇప్పటికే బరిలో నిలిచే అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలతో ఓటర్లకు దగ్గరవుతున్నారు. సమావేశాలు, సదస్సులు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి హామీలు గుప్పిస్తున్నారు. సొంతంగా మేనిఫెస్టోలు విడుదల చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ హోరెత్తిస్తున్నారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధి విస్తృతంగా ఉండడంతో ఇప్పటికే ఓ మారు చుట్టేసి వచ్చారు. ఓటర్లను కలుస్తూ మద్దతు కోరుతున్నారు.

పోటీలో అనేక మంది

ఉపాధ్యాయ, విద్యారంగ ప్రముఖులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థి సంఘ నాయకులు, ప్రొఫెసర్లు, పలు సంఘాల నాయకులు పోటీలో నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటివరకు అధికారికంగా బీజేపీ అభ్యర్థిగా పట్టభద్రుల స్థానం నుంచి సంగారెడ్డి జిల్లాకు చెందిన ఆ పార్టీ నాయకుడు అంజిరెడ్డిని ప్రకటించగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్క కొమురయ్యను ప్రకటించింది. మిగతా ప్రధాన పార్టీలేవి ఇంకా అభ్యర్థుల పేర్లు అధికారికంగా వెల్లడించలేదు. మంచిర్యాల జిల్లా నుంచి ఉపాధ్యాయ సంఘాల నాయకుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి పోటీ చేస్తున్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తెలంగాణ చాప్టర్ మాజీ అధ్యక్షుడు బీఎస్‌రావు, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట తదితర ప్రాంతాల నుంచి పలువురు పోటీలో ఉండేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వీరు ఆయా పార్టీల నుంచి అభ్యర్థిత్వం ఆశిస్తున్నా ఇంకా ఖరారు కావాల్సి ఉంది. స్వతంత్రంగా పలువురు యువకులు బరిలో ఉండేందుకు ఆరాట పడుతున్నారు.

అమల్లోకి కోడ్

ఎమ్మెల్సీ స్థానానికి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పదవీ కాలం మార్చి 29న పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో ఆలోపు ఎన్నిక నిర్వహించేందుకు బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఓటింగ్, ఓట్ల లెక్కింపుపై షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో ఎన్నికల కోడ్ తక్షణం అమలు కానుంది. ఫలితంగా సంక్షేమ పథకాల అమలుకు బ్రేక్ పడనుంది. ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం కాగా, ఎన్నికల నిర్వహణ కోసం ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం ఆ మేరకు అంతా సిద్ధం చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఆయా జిల్లాల కలెక్టర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పరిహారం చెల్లించాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: బెజ్జూర్ మండలంలో ప్రాణహిత- చేవేళ్ల ప్రాజెక్టు కాలువల్లో కోల్పోయిన భూములకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని బాధిత రైతులు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. పలువురు రైతులు మాట్లాడుతూ 2016లో అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టు కోసం సర్వే చేసిందన్నారు. కొందరికి పరిహారం అందించగా, పోతెపల్లి, బారెగూడ, అర్కెగూడ గ్రామాలకు చెందిన సుమారు 21 మందికి పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్లుగా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. భూములు కోల్పోయి అవస్థలు పడుతున్నామని, కలెక్టర్ స్పందించి పరిహారం ఇప్పించాలని కోరారు. రైతులు మురళీధర్‌గౌడ్, నానయ్య, మల్లేశ్, దుర్గయ్య, రమేశ్, చిన్నయ్య, శంకర్, నారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంటపొలంలో సూర్యచంద్రుల విగ్రహం


విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని మేదరిపేట సమీపంలో గల లక్ష్మీనారాయణస్వామి ఆలయ సమీపంలో గల పంట పొలంలో బుధవారం సూర్యచంద్రుల విగ్రహం బయటపడింది. గ్రామానికి చెందిన లింగాల శ్రీమతి పంటపొలంలో ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా విగ్రహం బయటపడింది. దీంతో వెంటనే విగ్రహాన్ని బయటకు తీసి శుద్ధిచేసి, పూజలు చేశారు. స్థానికులు విగ్రహాన్ని శుద్ధిచేసి పూజలు చేశారు.

ఐసీఏఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జిల్లావాసి


శైలేశ్ ఖండెల్వాల్

ఆదిలాబాద్‌టౌన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జిల్లాకు చెందిన శైలేశ్ ఖండెల్వాల్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీలో తొమ్మిది మంది సభ్యులు ఉండగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన శైలేష్ ఎంపిక కావడంపై చార్టెడ్ అకౌంటెంట్లు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: ఈ నెల 27న ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మైలగాని శంకర్ (54) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఏఎస్సై దివాకర్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శంకర్ పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 27న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

'ఇర్ఫాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్‌రూరల్: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇర్ఫాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జు గెలుపును ఓర్వలేక లేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెందూర్ దాదిరావు, వెట్టి మనోజ్, పర్ధాన్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సెడ్మకి సుభాష్, తుడుందెబ్బ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రేణుకా పాల్గొన్నారు.

పంచర్ దుకాణం దగ్ధం

బోథ్: మండలంలోని సొనాలలో బుధవారం తెల్లవారు జామున పంచర్ దుకాణం దగ్ధమైనట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. మహమ్మద్ దావూద్‌కు చెందిన పంచర్ దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో దగ్ధమైంది. ఘటనలో రూ.1,80,000ల విలువైన సామగ్రి దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు.


మెస్రం వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటున్న కొత్త కోడళ్లు


నాగోబా విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


గోవడ్ వద్ద సహపంక్తి భోజనాలు చేస్తున్న మెస్రం వంశ మహిళలు, కొత్త కోడళ్లు


సంప్రదాయ వంటలు వండి కితల వారీగా పంచుతున్న మెస్రం వంశ మహిళలు


నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న ఖమ్మం ఐటీ శాఖ ఏసీపీ వెంకటేష్

నాగోబాకు పూజలు..

- వేకువజాము వరకు కొనసాగిన భేటింగ్
- ఉపవాస దీక్ష విరమించిన కొత్త కోడళ్లు
- కేస్లాపూర్‌కు తరలివస్తున్న భక్తజనం

ఇంద్రవెల్లి(ఖానాపూర్): పుష్యమాస అమావాస్య పురస్కరించుకుని మంగళవారం రాత్రి మెస్రం వంశీయుల మహా పూజతో నాగోబా జాతర ప్రారంభమైంది. అధికారికంగా ఫిబ్రవరి 4వరకు కొనసాగుతుందని ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. తొలి రోజు ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని నాగోబాను దర్శించుకున్నారు.

పథకాలపై అవగాహన

జాతరలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ స్టాల్‌ను ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏఎస్పీ కాజల్, సీనియర్ సివిల్ జడ్జి బి.సౌజన్య ప్రారంభించారు. అనంతరం భక్తులకు న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. ఆయా ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తు స్వీకరణ స్టాల్‌లో వివిధ సంక్షేమ పథకాల మంజూరు కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.


నాగోబా దర్శనానికి బారులు తీరిన భక్తులు


భేటింగ్ తరువాత దర్శనం


గోవడ్ వద్ద పూజలు చేస్తున్న కోడళ్లు


రంగులరాట్నాల వద్ద సందడి

భేటింగ్‌కు.. 80 మంది కొత్త కోడళ్లు

మంగళవారం రాత్రి మెస్రం వంశీయులు మహాపూజ నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభించారు. రాత్రి ఒంటి గంట నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు భేటింగ్ నిర్వహించారు. 80 మంది కొత్త కోడళ్లు తెల్లటి దుస్తులు ధరించి ఇందులో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం వంశపెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ ప్రక్రియతో వారు పూర్తిగా మెస్రం వంశంలో చేరినట్లు భావిస్తారు. మంగళవారం ఉదయం నుంచి ఉపవాసదీక్షలో ఉన్న కొత్త కోడళ్లు బుధవారం ఉదయం గోవడ్ వద్ద కొత్త కుండల్లో వండిన నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి దీక్ష విరమించారు.


భేటింగ్‌కు ముందు ఆలయం ఎదుట తెల్లటి దుస్తులు ధరించి కూర్చున్న కొత్త కోడళ్లు

ఏర్పాట్లు పర్యవేక్షించిన సబ్ కలెక్టర్

బుధవారం తెల్లవారుజాము నుంచే ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో ఏర్పాటు చేసిన రంగులరాట్నాలు, దుకాణాల సముదాయాల వద్ద సందడి నెలకొంది. సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు, మెస్రం వంశీయులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.


న్యాయ సేవ స్టాల్‌ను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏఎస్పీ కాజల్, జడ్జి సౌజన్య

ప్రేమ విఫలమై యువకుడు బలవన్మరణం

బెల్లంపల్లి: ప్రేమించిన యువతితో వివాహం కాకపోవడంతో మనస్తాపం చెంది యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్సై కే.మహేందర్ తెలిపిన వివరాల మేరకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన చింతల వివేక్ (21) ఇటీవల బెల్లంపల్లిలోని రడగంబాల బస్తీలో ఉంటున్న తన అమ్మమ్మ రేగుల లింగమ్మ వద్దకు వచ్చాడు. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతూ దిగాలుగా ఉంటున్నాడు. కుమారుడిని చూసేందుకు రెండు రోజుల క్రితం అతని తల్లి రాజేశ్వరి కూడా బెల్లంపల్లికి వచ్చింది. మంగళవారం అర్ధరాత్రి వరకూ వివేక్ గదిలో టీవీ చూస్తూ పడుకోగా తల్లి రాజేశ్వరి, అమ్మమ్మ హాలులో పడుకున్నారు. బుధవారం ఉదయం నిద్రలేపేందుకు తలుపు తీసి చూడగా రేకుల పైకప్పుకు చీరతో ఉరేసుకుని కనిపించాడు. ప్రేమ విఫలం కావడంతోనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తల్లి రాజేశ్వరి పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు బలవన్మరణం చెందారు. మంచిర్యాల జిల్లా కాసిపేటలో అనారోగ్య సమస్యలతో సింగరేణి రిటైర్డు కార్మికుడు పురుగుల మందు తాగగా, నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని చించోలి (బి)లో యువకుడు ఉరేసుకున్నాడు. ఇదే మండలంలోని బోరింగ్‌తండాలో మద్యానికి బానిసై పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందాడు.

అనారోగ్య సమస్యలతో సింగరేణి రిటైర్డ్ కార్మికుడు..

కాసిపేట: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పురుగుల మందు సేవించి సింగరేణి రిటైర్డు కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు రత్నం రాజలింగు (56)కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. బుధవారం కాసిపేట శివారులోని టేకు ప్లాంటేషన్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు రత్నం అనువర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడు..

సారంగపూర్: జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన కొంతం రమేశ్ (22)కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం తన ఇంటిపైన గల రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

సారంగపూర్: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మండలంలోని బోరింగ్ తండాకు చెందిన జాదవ్ సంజీవ్ (22) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించి ఇంటికి రావద్దని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం పంటపొలానికి వెళ్లి గుర్తు తెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో నిర్మల్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏటిగూడెంలో క్షుద్ర పూజలు

బెజ్జూర్: మండలంలోని ఏటిగూడెంలో మంగళవారం రాత్రి క్షుద్ర పూజలు నిర్వహించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో 14 రోజుల క్రితం ఎర్నాగి చిన్నయ్య మృతి చెందగా శవాన్ని పాతిపెట్టారు. మంగళవారం మౌని అమావాస్య సందర్భంగా కొందరు వ్యక్తులు సమాధిని రాత్రి తవ్వి ఎముకలు తీసుకెళ్లారు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో బెజ్జూర్ పోలీసులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

ఆదాయపన్ను రద్దుకు కృషి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల ఆదాయపన్ను రద్దుకు కృషి చేస్తామని ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. బుధవారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కోలిండియాలో మాదిరి ఆదాయపన్ను రద్దుకు యూనియన్ సెక్రటరీ జనరల్ బీ.జనక్ ప్రసాద్ యజమాన్యంతో చర్చిస్తున్నారన్నారు. సమావేశంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, పేరం రమేశ్, కేంద్ర కార్యదర్శి మెండె వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో చోరీ

సోన్: మండలంలోని న్యూబొప్పారంలో గల హనుమాన్ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ...ఆలయ పూజారి వోజ స్వామి రాత్రి ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. కొద్దిసేపటికే గుర్తు తెలియని దుండగుడు ఆలయం ముందున్న హుండీని గడ్డపారతో పగులగొట్టి అందులో ఉన్న రూ.5 వేలు ఎత్తుకెళ్లాడు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై షేక్‌అహ్మద్ హుస్సేన్ తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఒకరి రిమాండ్

లక్సెట్టిపేట: మండలంలోని చందారంకు చెందిన మిల్కూరు మల్లేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు కావడంతో బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. రంగపేటకు చెందిన ఆవునూరి రాజయ్య వారసత్వంగా వచ్చిన భూమిలో సాగుచేసుకుంటుండగా ఈనెల 25న మల్లేశ్ అట్టి పొలం వద్దకు వెళ్లి బల్లికొండ రమేశ్ వద్ద నేను కొనుగోలు చేశానని, ట్రాక్టర్ వీల్స్‌తో పంటను ధ్వంసం చేయడమే కాకుండా కులం పేరుతో దూషించాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏసీపీ ప్రకాశ్ విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన మాడెపు శంకర్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. కోణంపేటలో నాయిని మొండక్కకు చెందిన ఆవు రెండు నెలల క్రితం శంకర్ పత్తి చేనులో విషాహారం తిని చనిపోయింది. అడవి జంతువులకోసం తానే విషాహారం పెట్టానని, పరిహారం చెల్లిస్తానని పెద్దల సమక్షంలో ఒప్పుకున్నాడు. ఇంతవరకూ చెల్లించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

కుటుంబంపై మూకుమ్మడి దాడి

బోథ్: మండల కేంద్రానికి చెందిన షేక్ ముఫీజ్ కుటుంబంపై బుధవారం కొంతమంది దాడి చేశారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ ముఫీజ్ ఇంట్లో ఈ నెల 28న జరిగిన తన సోదరి కూతురు నామకరణ కార్యక్రమంలో షేక్ నదీమ్ అనే వ్యక్తి మద్యం తాగి వచ్చి బూతులు తిట్టాడు. అడ్డువచ్చిన ముఫీజ్ సోదరుడు వాహిద్‌ను కొట్టా డు. బుధవారం ఉదయం నజీర్‌తో పాటు అతని కుటుంబసభ్యులు షేక్ నవీద్, షేక్ నదీమ్, నిర్మల్ నుండి వచ్చిన షేక్ అఖిల్, షేక్ అక్బర్, షేక్ అహ్మద్, అర్బాజ్, అబిద్ షేక్‌తో పాటు మరికొంత మంది ఇంటికి వచ్చి షేక్ ముఫీజ్‌తో పాటు అతని భార్య, తండ్రి నవాబ్, సోదరుడు వాహీద్, బావ షేక్ అలీం, కోడలిపై దాడి చేశారు. బూతులు తిడుతూ నానా హంగామా సృష్టించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్
- వసంత పంచమి ఏర్పాట్లపై సమీక్ష

భైంసా: నిర్మల్ జిల్లా బాసరలో నిర్వహించనున్న వసంత పంచమి వేడుకలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ సూచించారు. బుధవారం బాసర ఆలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వసంత పంచమి వేడుకలకు తాను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతోపాటు పలువురు రాష్ట్ర మంత్రులను కలిసినట్లు వెల్లడించారు. అనంతరం అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

బాసరలో మౌని అమావాస్య పూజలు


గోదావరిలో స్నానాలు చేస్తున్న భక్తులు


పూజలు చేస్తున్న భక్తులు

భైంసా: బాసరలో బుధవారం మౌని అమావాస్య సందర్భంగా భక్తుల సందడి కనిపించింది. ఉదయం నుంచే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. సూర్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కాగా, సరైన ఏర్పాట్లు లేక గోదా వరి ఘాట్‌ల వద్ద భక్తులు ఇబ్బంది పడ్డారు. అనంతరం బాసర ఆలయంలో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారులతో అక్షరాభ్యాస పూజ లు చేయించారు.

ఏసీబీకి చిక్కిన పశువైద్యాధికారి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్‌కు చెందిన పశువైద్యాధికారి రమేశ్ రాథోడ్ బుధవారం రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. శ్యాంపూర్‌లోని వెటర్నరీ ఆస్పత్రిలో రమేశ్ రాథోడ్ వైద్యాధికారిగా పనిచేస్తున్నాడు. అదే ఆస్పత్రిలో పనిచేస్తున్న సహోద్యోగి జుగ్నాక మాదవ్ రావు ఇటీవల నార్నూర్ మండలానికి బదిలీ అయ్యాడు. దీంతో సదరు ఉద్యోగి రెండు నెలలకు సంబంధించిన వేతన బకాయిలు, డ్యూటీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.30వేలు డిమాండ్ చేశాడు. ఎంత బతిమాలినా ఇవ్వక పోవడంతో చివరకు రూ.15 వేలు ఇచ్చేందుకు అంగీకరించాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం ఆస్పత్రిలో బాధితుడి కుమారుడి నుంచి రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధి కారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.


పట్టుబడిన రమేశ్ రాథోడ్

పోలీసు క్రీడోత్సవాల్లో ప్రతిభ

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రస్థాయి పోలీసు క్రీడోత్సవల్లో సైక్లింగ్, రెజ్లింగ్ విభాగంలో తృతీయస్థానం సాధించిన ఆర్ఎస్సై చుక్క రాజేశ్‌ను ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావ్ బుధవారం అభినందించారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఆర్ఎస్సైగా పనిచేస్తున్న చుక్క రాజేశ్ కరీంనగర్‌లో నిర్వహిస్తున్న పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో 47 నిమిషాల్లోనే 20 కిలోమీటర్ల సైక్లింగ్ విభాగంలో తృతీయస్థానం, రెజ్లింగ్ 97 కేజీల విభాగంలో (ఫ్రీ స్టైల్) తృతీయస్థానం సాధించాడు.


సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న రాజేశ్